


బస్సు ఘాట్ రోడ్డు మీద నించి పోతుంటే యెదురు చూస్తున్న నా కళ్ళకు ఒక పులీ అగపడలేదు. బహుశః నా చిన్ననాటి వూహాలోని ఆ మాయ కతలో కొంత యిప్పటికి నిల్చిపోవటం వలన కామోసు పులిని పట్టపగలు రోడ్డు వార చూడాలన్న కోర్కె కలిగింది.

వంకర టింకరదగా పోతున్న ఘాట్ రోడ్డు కు డీసెల్ బస్సు యెగ బాకుతుంటే కొంతసేపటికి నా చిన్ననాటి దృశ్యాలు తలలో తిరిగాయి. ఆ రోజుల్లో ఈ ఘాట్ రోడ్డు నిచ్చెనలా వుంటాయనీ, పులులు కీకారణ్యంలో నున్న రోడ్ల మీదే పడుకుంటాయనీ, పొప్పాంయ్ మని హారన్ కొట్టినా కదలవనీ...యిలా యెన్నో అనుకోడానికి ఆస్కారం ఇచ్చింది మా పెద్దమ్మ.

నా చిన్నతనంలో నేను మా తాతగారింట్లో వుండేవాడిని. మా పెద్దమ్మ మూడేళ్ళ కొకసారి కన్నవారింటికి వచ్చేది. మా పెద్దమ్మ భర్త యేజెన్సీ ప్రాంతంలో ఫారెస్టు డిపార్ట్‌మెంట్‌లో పని చేసేవాడు. మా పెద్దమ్మ ఆరోజుల్లో ఆ అడవిమధ్య గ్రామంనించి కొంత దూరం నడచి, అక్కడినించి బండిమీద వచ్చి, తరువాత బస్సెక్కి, బస్సు దిగాక రైలెక్కి, రైలుదిగి మూడుమైళ్లు గూడుబండిమీద కన్నవారింటికి వచ్చేది. ఈ కూతురు వస్తే పండగలా వుండేది. మా అమ్మమ్మ ఈ కూతుర్ని గట్టిగా కౌగలించుకుని దూరంగా వున్నదని ఏడ్చేది. మేం పిల్లలం — గూడుబండికి యెదురెళ్ళేవాళ్ళం. గూడుబండినిండా పెట్టెలతోబాటు, అడవి ప్రాంతంలో దొరికే అన్ని వస్తువులూ వుండేవి. బండి వెనక మా పెద్దమ్మ ఒడిలో బిడ్డతో కూర్చుండేది. ఆ బండినుంచి ఇంటికి —కొండ చీపుర్లు, చాపలు, కందుల బస్తా, తట్టా-బుట్టా, విసినకర్రలు, గుమ్మడికాయలు, చందనంకర్రలు వగైరా వగైరా యెన్నో వుండేవి — మా పెద్దమ్మ మనిషిపేరా యేదో ఒకటి తెచ్చేది. ఆ సారి నాకు ఒక పిల్లనగ్రోవి యిచ్చింది. అది యెలా వూదటమో నాకు పెద్దమ్మే నేర్పింది. ఆ పిల్లనగ్రోవి పట్టుకుని మామిడితోటకు పరుగెత్తాను. నాకు నచ్చిన సినిమా పాటలు, కూనిరాగాలు అన్నీ ఒంటిగా ఆలాపిస్తే నా చుట్టూ, నేనో పిట్టననుకుని కామోసు రకరకాల పిట్టలు అరుస్తున్నాయ్. ఉత్సాహంతో పెద్దమ్మ దగ్గరకు వెళ్ళి—

"పెద్దమ్మా పెద్దమ్మా ... ఈ పిల్లన కర్ర పిట్టలు పాడే చోటునించి తెచ్చావు కదూ?"

"కాదురా. పులులు అరిచేచోటునించి తెచ్చాను."

పులి పేరెత్తగానే నేను "అమ్మో" అన్నా. పులిగురించి తెలుసుకోవాలనే వుబలాటంతో—

"పెద్దమ్మా ... పెద్దమ్మా నీవు పులిని చూశావా?"

"చూడట మేమిటి? పులులమధ్యనే నేం వుంటే!"

"అమ్మో...మధ్యనే, చంపేయవూ?"

ఆమె పులుల కథలు ఎన్నో చెప్పింది. అవి మేం కథల్లా విన్నా నిజంగా జరిగిన వేనట. వాళ్ళు పెంచిన మంచి బుల్ డాగ్‌ని పులి యెలా ఎత్తుకుని పోయిందో

తెవీ వేసీకద్దే కోళ్ళూ, అవులూ, యెక్కడున్నా కాజేస్తాయనీ, యిక్కడ కాకులేలా అరుస్తాయో వాళ్ళింటిదగ్గర పులులలా అరుస్తాయనీ, యిలా యెన్నెన్నో చెప్పింది.

నేను వయసులో విద్యలో పెరిగాక మా పెద్దమ్మ గోరంతలు కొండంతలు చేసి పులిగురించి చెప్పిందనుకున్నాను. ఆయుధాలు లేకుండా పులులూ, సింహాలతో పోట్లాడిన వీరులగాథలు నా చదువులో యిరికించడం వలన మనిషి చే ఓడిన పులి అంత భయంకరమైన జంతువు కాదని, పులి అంటే నాకు భయం పోయింది. అలా అనుకుంటున్న రోజుల్లో మా పెద్దమ్మ కన్నవారి యింట్లో శాశ్వతంగా వుండిపోడానికి వచ్చింది. ఆమె భర్త పులుల వేటకు తన పైనున్న పెద్ద ఆఫీసర్లతో వెళ్ళాడు. అతనిని ఎత్తుకపోయిన పులిని తుపాకితో పేల్చి చంపారు గానీ అతని ప్రాణాన్ని రక్షించలేక పోయారు. ఈ సంఘటన విన్నాక నాకు మళ్ళీ పులంటే పక్క బెదురు కలిగింది. సర్కసులో బోనులో వున్న పులికంటే దాని రాజ్యంలో యేలుబడి చేస్తుండగా పులిని చూడాలన్న కోరిక యిప్పటికీ పోలేదు.

డీసెల్ బస్సు ఘాట్ రోడ్డు దిగుతుండగా దిగువనున్న దట్టమైన అడవిలో కోతులు, కొండముచ్చులే కనుపించాయి. చెట్లపైని, ఆకాశాన కదులుతున్న తెల్ల మేఘాల ఛాయలు అక్కడక్కడ పడుతున్నాయి. కొండపై అప్పుడే పొగమంచు కదులుతోంది. కొద్దిగా చలివేస్తోంది. బస్సు ఆగింది ఏదో చిన్న రిపేరు. ఇది పెద్ద రిపేరైతే ఈ రాత్రి యిక్కడ వుంటే-పులుల అరుపులు విని, వెన్నెట్లో వాటి పరుగు తిలకించేవాడిని. కానీ బస్సు కదలిపోయింది నేను గమ్యస్థానం చేరేసరికి రాత్రి పది గంటలయింది. ఆ రాత్రివేళ నాకోసం మా బావ జీపుతో కాసుకు కూర్చున్నాడు. అప్పటికే మంచు కురుస్తోంది చలి బ్రహ్మాండంగా వుంది.

మా బావ ఈ యేజన్సీ ప్రాంతంలో కూంలనున్న గ్రామీణ ఆరోగ కేంద్రంలో మెడికల్ ఆఫీసర్‌గా వుంటున్నాడు. ఉదయం పదిగంటలవరకూ మంచు కురుస్తుంటుంది. సాయంత్రం అయిదు దాటితే యింటినుంచి కదలలేం. అంతా నిశ్శబ్దం. మనుషుల మాటలు కూడా మెల్లగా వస్తున్నాయి. ఒకోసారి వణుకుతూ అన్న మాటలు కూడా సరిగ్గా అర్థం కాలేదు. డాక్టరుకు రోజు ఒకటో అరో కేసు తప్పించి మరేంపని లేదు. ఎటుచూసినా కొండలు. కొండలపై పచ్చని అడవులు. ఆ అడవులపై నీలి ఆకాశం. ఆకాశంలో నిప్పులు కురవని సూర్యుడు. మంచు తెరల్లో చల్లబడి చంద్రుని లా పాలిపోతున్నాడు. ఇక్కడ వుత్తేజపరచేదేదీ జరగటంలేదు. రెండు రోజులకే నాకీ ప్రదేశంపై మమకారం పోయింది.

"ఇక్కడ ఏం చూపించడానికి నన్ను పిల్చావు?" అడిగాను మా బావను నాల్గో రోజున.

"ఏం చూడాలని వచ్చావ్?"

ఈ ప్రశ్నకు సమాధానం వచ్చింది.

పులులు-వాటిరాజ్యానికి పోవాలంటే యింకో యిరవైమైళ్ళు దక్షిణంగా పోవాలి. కచ్చా రోడ్డు. జీపుకి హెడ్డు లైటు పెట్టి ఓరోజు వేటకెల్దాం.

"అక్కడ యింకా చూడవలసిన వేమైనా వున్నాయా?"

"ఉత్తరం వేపు రోడ్డులేదు. నడచి పదిమైళ్ళు దాటి కొండత్రోవను వెళ్ళామంటే ... జంతువులు తప్పించి మనుషులు వుండరనుకున్న కారడవిలో మనుషులున్నారని ఈమధ్యనే అంటే యేడాదై తెలుసుకున్నారు. ఆడా మొగా మొలకు ఆకులు తప్పించి ఒంటిమీద బట్టవుండదు. దుంపలూ, కాయలూ తిని నీరు త్రాగుతారు. కొన్ని ఆకులుకూడా తింటూంటారు. ఇక నువ్వుగానీ అక్కడకు వెళ్ళావంటే తిరిగి రావు.

"ఏం బాణాలు వదుల్తారా?"

"ఆ ఆడవాళ్ళ బిగువుకు గులామై అక్కడే వుండిపోతావ్" ఇక్కడా ఏదో ప్రాణం వున్నట్లనిపించింది. ఆ సాయంత్రం ఆ కొండల్లో వుత్తరం వేపు రేగిసే పొగ రానురాను రాత్రి అయ్యాక మంటలయ్యాయ్. ఆ మంటల వెలుగులో ఆ బిగువైన ఆడవాళ్లు కనిపిస్తారేమోనని దీక్షగా కిటికీ సందునించి చూశాను.

"ఏం చూస్తున్నావ్?"

"చలికి ఆ నగ్న సుందరులు మంట వేసుకున్నారు."

"చలికి వేసుకున్న మంటలు యింత దూరానికి అగుపించవ్. అడవిని కాల్చుతున్నారు."

"దేనికి?"

"ఆ కాలిన స్థలంలో మెట్టపంటలు పండిస్తారు."

"కొండమీద యేం పండుతుంది? ఇటువేపంతా టేకు అడవుల్లా వున్నాయ్. కాల్చేస్తూంటే ప్రభుత్వం సహిస్తోందా?"

"సిబ్బంది భయపడి చూసీచూడనట్లు వూరుకునేవారు. కానీ ఈ మధ్యవచ్చిన ఫారెస్టు రేంజరు చాలా చండశాసనుడు."

నా మదిలో తలంపులు నా చలిని కొంతవరకు తగ్గించాయ్. ఎలాగైనా పులివేటతో బాటు ఆ నగ్నసుందరులను చూసి మరీ వెళ్తానని అనుకున్నాను. ఒక పావుగంటలో బయలు దేరతామనగా మా బావకు అర్జంటుగా మూడు కేసులొచ్చాయి రమ్మని కబురొచ్చింది.

"కొట్లాట కేసులేమో. ఈవేళ మనం వెళ్ళలేమనుకుంటాను, నువ్వూ రా కూడదా?"

నేను మా బావ వెంటబడ్డాను. మూడు వుయ్యాలల్లో ముగ్గురు పేషెంట్లు వున్నారు. ఉయ్యాల మోసినవారిలో ఒక ఆడదికూడా వుంది. ముగ్గురిలో యిద్దరు త్రోవలోనే చచ్చిపోయారు. ఆ యిద్దరూ కాకినిక్కరు చలిబనియన్లతో వున్నారు. బ్రతికున్నవాడి మొలకు ఆకులు తప్పించి ఒంటిమీద బట్టలేదు. మాంచి పికపికమనే వయసులో వున్నాడు. బుర్ర పులి బుర్రలావుంది. ఆ నోటిలో పళ్లు పులిపళ్ళల్లావున్నాయ్.

పోడీకాళ్ళు, చేతుల వేళ్ళకు గోళ్ళు పెరిగి పులిగోళ్ళల్లా వాడిగా వున్నాయ్. వాడు యేదో అదేపనిగా కోదుభాషలో బొబ్బలు పెట్టున్నాడు. వెంటనే వాడిని ఆపరేషను టేబిల మీద పెట్టాడుడాక్టరు. నన్ను లోపలికి రమ్మన్నా వెళ్ళలేదు. బయట నుంచే వాడి వర్ణనకు సరిపోల్చిన ఈ కోదు స్త్రీ వుంది.

తుపాకిదెబ్బ కుడితొడపై తిన్న ఆ కోదు భార్య అయివుంటుంది. వాడిని ఆ వుయ్యాల్లో మోసుకొని వచ్చింది. ఎటువంటి సిగ్గూపడలేదు. నా కళ్ళ ముందు నిటారుగా నిల్చుని లోపలినించి యేం కబురొస్తుందోనని ఆత్రుతగా చూస్తోంది.

ఇంతలో బాగా చీకటిపడింది. ఆమె ఒళ్ళు వణుకులు నా కంటికి యిక కనపడ లేదు. ఆమె యింకా కూర్చోలేదు. నేను చలికి కామోసు వణుకుతున్నాను. నేనూ ఆమె అక్కడ వున్నాం. ఇంతలో తలుపులు తెరవబడ్డాయ్. వాడిని ఒక మంచంమీద వేశారు. ఆమె వాడిమీద పడిపోబోతూంటే మా వాడు కొద్దిగా ప్రక్కకు వుండమన్నాడు.

"నీపని సరా..."

"లేదు. ఈ రెండు శవాలను పోస్టు మార్టమ్ చెయ్యాలి. నువ్వింటికి వెళ్ళ కూడదూ?"

ఆ రాత్రి వాడు యింటికి వచ్చేసరికి పన్నెండు గంటలైంది. నేను యింకా తెలివిగానే వున్నాను. ఒకసారి లేచి ఆసుపత్రికి వెళ్ళాలని మనసుపుట్టేది.

"వాడిపెళ్లాం యెలావుంది" అన్నాను. వాడు ఆగాడు.

"అమోఘంగా వుంది."

"మీద చెయ్యి వెయ్యగలవు. అది పులిమీదకు వురికినట్లు వురుకుతుంది."

"ఇంతకీ జరిగిందేమిటి?"

"వాడి అరుపులు నీకు అర్థం కాలేదు కదూ?"

"ఆవేశంతో అంటున్నాడని మాత్రం చెప్పగలను."

"ఈ క్రొత్త రేంజరు ఛండశాసను డన్నాను కదా! ఆర్డర్లు జమలు పర్చ డానికి నెట్టుకున్నాడు. అడవులు కాల్చ కూడదు. కలప బయటకు తీసుకువెళ్తే పన్ను కట్టాలి. పండించినా పన్ను కట్టాలి. ఈ కోదువాడు అడవులు కాలు స్తున్నాడు. పన్ను కట్టకుండా కలప కొట్టున్నాడు. పండించి పన్ను లేదు పొమ్మంటున్నాడు. చివరికి ఒక్కడేకదా ఏం చెయ్యగలడని ఈ యిద్దరు ఫారెస్టు గార్డులు, వాడు అడవి కాల్చడానికి వెడితే అడ్డుకున్నారు. ఒకడి గుండెలో బాణం నాటాడు. రెండోవాడి గుండె లోనూ నాటాడు. వాడు అంతలో తుపాకి పేల్చాడు. గుండు పిడితొడలో వుండిపోయింది. ఆ బాణాల్లో విషం వుంటుంది. అందుకే వాళ్లు చచ్చారు.

"వాడు యేమిటలా అరుస్తున్నాడు?"

"ఇది మా రాజ్యం. మా తావు. మా ముత్తాతలు అడవిని కాల్చారు. మేం కాలుస్తాం. మా ముత్తాతలు పన్నులు యెప్పుడూ కట్టలేదు. మేమూ కట్టం. మీ బట్టా-పాతా మాకొద్దు. మీ వేషా బాసా మాకొద్దు. మా రాజ్యం లో మమ్మల్ని అడ్డుకోడానికి మా యిచ్చకు కాదనడానికి మీరెవరు? మా జాగాల్లో అడుగెట్టింది కాకండా మమ్మల్నిలా నాశ నం చెయ్యడానికి నెట్టుకున్న పిశాచాలు మీరు! ఫోండి... పోతారా... లేదా?"

మా బావ అంటున్నా నేను ఆ కోదు వాడు అంటున్నప్పుడు పొందే ఆవేశమే పొందాను.

"పులివేటకు యింకోరోజు వెళ్దాంలే" అన్నాడు, మా బావ పరుపు మీద వాలుతూ. మా పెద్దమ్మ భర్తను పులి యెందుకు యెత్తుకు పోయిందో ఇప్పుడు నాకు అర్థమయ్యింది.

"మరెందుకు? అప్పుడే గుండుదెబ్బ తిన్న పులిని చూశాను."

□ □ □

